# కామ్రేడ్ కారం పార్వతి వర్ధంతి సభ



కామ్రేడ్ కారం పార్వతి స్థూపంవద్ద నివాళులు

**మనుగోపాల, 4-11-19:**
భూస్వామ్య తుపాకీ గుండ్లకు బలైన కామ్రేడ్ కారం పార్వతి 22వ వర్ధంతి సందర్భంగా 4-11-19న పోలవరం మండలంలోని జిల్లెళ్ళగూడెం పంచాయతి మనుగోపాల గ్రామంవద్దనున్న కా॥కారం పార్వతి స్మారక స్థూపంవద్ద వివిధ గ్రామాల నుండి హాజరైన 500 మంది గిరిజన ప్రజానీకం నివాళులర్పించారు.
ఏజెన్సీ గిరిజన సంఘం జెండాను రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రఅధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సి ఆవిష్కరించి అమరులందరకూ జోహార్లర్పించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యదర్శి కా॥ఎం.ఎస్. నాగరాజు, నవయువసమాఖ్య(ఎన్‌వైఎస్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి కా॥ఎస్‌కె బాషా, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్స్ కుంజం రామారావు, కలుం గంగాదేవి, కలుం సూరమ్మ, కలుం వెంకటేశ్వరరావు, పట్టం పరమేషులతోపాటు ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు పోలుమాటి పెంటయ్య స్థూపంవద్ద పూలు వుంచి కా॥కారం పార్వతికి ఘనంగా జోహార్లు అర్పించారు.

అనంతరం దొండపూడిలోని సుబ్బరాయుడి గుడినుండి సంతబజారు, స్టేట్‌బ్యాంక్ మీదుగా రామాలయం వరకు మిన్నంటిన నినాదాలమధ్య ప్రదర్శన, రాయాలయంవద్ద బహిరంగ సభ జరిగాయి. ఈ సభకు ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కా॥సవలం రాంబాబు అధ్యక్షత వహించగా, ప్రధానవక్తగా వచ్చిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 70 సంవత్సరాలుగా అమలు చేస్తూవస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగా దేశంలో ఆర్థికసంక్షోభం పెరిగి పోతోందని, సమస్త రంగాలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయన్నారు. వ్యవసాయరంగంలో తీవ్రమైన సంక్షోభం ఫలితంగా రైతాంగ ఆత్మహత్యలు నిరాటంకంగా సాగుతున్నా యన్నారు. వ్యవసాయరంగంలో సామ్రాజ్య వాదుల దోపిడీని అరికట్టకుండా, రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా కంటితుడుపుగా 'రైతుభరోసా' ఇస్తున్నారని విమర్శించారు. ఉల్లి పండించే రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదుకాని, మార్కెట్‌లో కిలో 50 నుండి 60 రూ॥ల వరకు ఉల్లిపాయలు అమ్ముడవుతున్నప్పటికీ ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్లకోసం రైతులకు అది చేస్తాం-ఇది చేస్తాం అంటున్నారు తప్ప రైతాంగ సమస్యలకు మౌలిక పరిష్కారంకోసం ఏవిధమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు.

1947కి ముందు బ్రిటీషు సామ్రాజ్య వాదులు ఒక్కరే దేశాన్ని దోచుకుంటే, నేడు అనేక సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు సమస్త రంగాలను అడవి, ఖనిజాలు, నదులను సైతం దోచుకుంటున్నారని అన్నారు. ఆదివాసులకు అడవిపై హక్కు కల్పిస్తామని చెబుతూ చేసిన '2006 అటవీ హక్కుల చట్టం' అమలు చేయకుండా, పర్యావరణవాదుల పేరిట సుప్రీం కోర్టులో పిల్ వేసి ఆదివాసులను వెళ్ళగొట్టాలని తీర్పును ఇప్పించారన్నారు. నవంబర్ 26న ఈ విషయంపై సుప్రీంకోర్టు తుదితీర్పును ఇవ్వ బోతుందని, అడవి నుండి దూరంచేసే విధంగా వుంటే మరింత సంఘటితంగా ఉద్యమించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ నిర్వాసితుల భూముల విషయం తేల్చకుండానే కోట్లాది రూపాయలు భూస్వాములకు, గిరిజనేతరులకు నష్టపరిహారం పేరుతో చెల్లించారన్నారు.

ఈ దేశంలో వున్న సంపదపై మనకే హక్కుకోసం, అందరికి విద్య, వైద్యంకోసం రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధరకోసం పోరాటాలను మరింత పదను పెట్టాలను చెబుతూ ఆమె ముగించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యదర్శి కా॥ఎం.ఎస్.నాగరాజు మాట్లాడుతూ ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం(ఆర్‌సిఇపి)లో 16 దేశాలు కూడి భారతదేశంలో ఎటువంటి పంటలు పండించాలో నిర్ణయించబోతున్నాయన్నారు. ఇతర దేశాల్లో ఏ పరిశ్రమల్ని అయితే నిషేదించారో వాటికి మనదేశంలో అనుమతులిస్తున్నారన్నారు.

తెలంగాణాలో ఆర్‌టిసి కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని పోరాడుతుంటే కెసిఆర్ ప్రభుత్వం కుదరదని, డబ్బులు లేవని, 5100 రూట్లను ప్రైవేటీకరించ బూనుకుందంటే, పాలకుల

కార్మిక వ్యతిరేకత స్పష్టమవుతోందన్నారు. ఈ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకమైనవని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సంసిద్ధం కావాలన్నారు.

ఏజెన్సీ గిరిజన సంఘం కార్యదర్శి కా॥కుంజం రామారావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సమగ్ర–శాస్త్రీయ పునరావాసం కల్పించాలని గత 15 సంవత్స రాలుగా ఏజెన్సీ గిరిజన సంఘం పోరాడు తుందని, సంఘం నాయకులపై ఈ క్రమంలో అనేక కేసులు పెట్టారన్నారు. నిర్వాసితులకు ఆర్&ఆర్‌ను ఇప్పటికీ నిర్ధారించలేదన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు.

ఇంకా ఈ సభలో నవయువసమాఖ్య (ఎన్‌వైఎస్) రాష్ట్రకమిటీ సభ్యుడు కా॥మిడియం రవిదొర, ఏజెన్సీ గిరిజనసంఘం నాయకులు కా॥కలుం గంగాదేవిలు మాట్లాడారు. ఈ సభలో ప్రజాకళాకారులు పాడిన పాటలు సభికుల్ని ఉత్తేజపరిచాయి. పేద్రాల గ్రామంలో నిర్మించుకున్న ఏజెన్సీ గిరిజన సంఘం కార్యాలయాన్ని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సీ ఉత్తేజపూరిత వాతావరణంలో ప్రారంభించారు.

ooo